# అదృష్టం పరీక్షించింది

"ఆశయాలు అందరికీ ఉంటాయి. కాని అవకాశమే లభిం చాలి-అవకాశందొరికి, అదృష్టం ఫలిస్తేనా?...ప్చ్... ఏమిటో తనపిచ్చి! అదృష్టమే వుంటే తన బ్రతుకు అలా ఎందుకుంటుంది? శేషు జీవితంలాగే ఉండును - మూడు పువ్వులూ ఆరుకాయలతో. నిజానికి శేషు తనకంటే ఎందులో అధికం?-ఒక్క డబ్బు తప్ప."

"నీ అందం నాకువుంటేనా కస్తూరి"...అని శేషే అంటూ ఉండేది - పచ్చని ముఖంమీద పడుతూన్న తన నల్లని ఉంగరాలజుట్టుని సుతారంగా సవరిస్తూ—

చురుకుతనంలోనూ మాటకారితనంలోనూ చెప్ప నక్కర్లేదు.

చదువులో సరేసరి, అందరి టీచర్ల దగ్గగా అన్ని సబ్జె

ష్టులకీ ట్యూషన్లు పెట్టించుకున్నా నగంమార్కులు వెనకే పడేది శేషు తనకంటే—

తనకున్న నగలగురించీ బట్టలగురించీ గొప్పగా ఇతర స్నేహితులతో తరుచుగా చెప్తూండడంతో నలుగురూకలిసి శేషుని ఎగతాళిచేస్తూంటే, ఆ అవమానాల నుంచి ఎన్నిమార్లు శేషూనితప్పించలేదు? ఆ మాటకొస్తే శేషూకారణంగా తను అవమాన పడవలసి వచ్చేది.

కొత్తనగ పెట్టుకున్నప్పుడల్లా, కొత్తచీర కట్టుకున్నప్పుడల్లా, వాళ్లకి చూపించాలి, వీళ్ళకి చూపించాలంటూబయలుదేరడం-సాయంకోసం తను ఎంత రానంటున్నా వినిపించుకోకుండా బలవంతంచేసి మరీ తీసుకుపోవడం - తీరా అవతల వాళ్లు శేషూ నగనీ చీరనీ మెచ్చుకోవడంతో ఆగక, తన బోసి మెడనీ వెలిగిన బట్టల్నీ హేళనగా చూడ్డంతో అవమానపడి తను చిన్న మొహం చేసుకుంటే, ఆ తర్వాత శేషూ తనని అనునయించడం—

ఇలా ఎవరు ఎంతగా తనని చిన్నచూపు చూసినా, తన మార్కులు చూసి ఎంతగా ఈర్ష్యపడినా - శేషూ మాత్రం నిండు మనస్సుతో తనకోసం బాధపడుతూ స్నేహ మధువుని ఒలికిస్తూనే ఉండేది.

అసలు ఒకరకంగా చెప్పాలంటే తనకి ఉన్న అదృష్టం అల్లా శేషూలాంటి స్నేహితురాలు ఉండడం ఒక్కటే! ఆ ఒక్క అదృష్టాన్ని చూసుకొనే తక్కిన దురదృష్టాల నన్నింటినీ చిరునవ్వుతో ఎదుర్కొ గలుగుతోంది తను.

"ఒక సామాన్య గుమస్తా కూతురుగా పుట్టడంతోటే నీ దురదృష్టాలు మొదలయ్యాయి అమ్మా" అని నాన్నగారు అన్నా—

పెళ్ళిచూపుల్లో చిరునవ్వుల్తో తనని పలకరించి, తనలో ఆశలు రేపి, కట్నం కానీకూడా నాన్న ఇవ్వలేకపోయిన కారణంగా, నచ్చిన తననిమానేసి డబ్బున్న శేషూని, ఆ తెలివైన ఆఫీసరు పెళ్ళిచేసుకున్నా—

రిటైరయిపోయిన నాన్నగారికి ప్రావిడెంట్ ఫండ్ రాక, సంసారం కష్టంగా గడుస్తూన్న సమయంలో తాను ఉద్యోగ ప్రయత్నాలు ఎన్నోచేసి అన్నిచోట్లా అపజయాన్నే ఎదుర్కొన్నా—

తను నిరుత్సాహపడి పోలేదంటే, దానికి కారణం: ఇన్నాళ్లూ శేషూ తనకి యిస్తూవచ్చిన ప్రోత్సాహ ప్రోద్బలాలే!

నిజంగా శేషూ ఎంత మంచిది!

పెళ్ళిలో అంతా శేషూ లాంటి భార్య దొరికిన ఆ పెళ్ళికొడుకు అదృష్టవంతుడంటూంటే; "కాదు అంతటి తెలివైనవాడు భర్తగా దొరకడం శేషూదే అదృష్టం" అంది తను శేషు బుగ్గలు తమాషాగా గిల్లుతూ. అదివిని వాళ్ళ అమ్మగారు, కొరకొర చూస్తూ పైకి మాత్రం నవ్వుతూ, "ఏవమ్మా-పోనీ ఆ పదివేలకట్నంపోసి, ఆ బృహస్పతిని కట్టుకుని ఆ అదృష్టం అంతా నువ్వే పొందకపోయావ్?"

అన్నారు వ్యంగ్యంగా-తనకి ఆ మాటలు వింటూంటే అవ మానంతో తల కొట్టేసినట్లయింది. ఎంత తెలివి ఉన్నా పరి స్థితినిబట్టి తను ఆమాట అనకుండా వుండవలసింది అనుకుంది కస్తూరి.

"ఈ సంబంధం మనకి చెప్పింది కస్తూరీ వాళ్ళే కదమ్మా. అటువంటి కస్తూరిని నీవు అంతమాట అనడం నాకు బాగుండలేదు" అంటూ తల్లితో అని, "ఏమను కోకు" అని తనని ప్రాధేయపడ్డట్టు అడిగింది. ఆరోజున ఇలా తన మనసు తెలుసుకున్న నేస్తంగా ఉండడం కన్నా అదృష్టం ఏముంది? ఏమిటో?... పెళ్ళయి వెళ్ళాక కొత్తలో అప్పుడప్పుడు రాస్తూండేది ఉత్తరాలు. ఈ మధ్య అదీ మానుకుంది. వాళ్ళఆయనకు ప్రమోషను అవుతుందనీ, ట్రాన్స్ఫర్ కూడా కావచ్చనీ రాసిన ఆ ఉత్తరం తర్వాత మళ్ళీ ఉత్తరమే లేదు.

ఏ వూరు ట్రాన్స్ఫరయిందో ఏం ఎడ్రసో శేషు రాయలేదు. పోనీ మీరేనా చెప్పండి అని వెళ్ళి వాళ్ళ అమ్మగారిని అడుగుదాం అని ఎన్నిమాట్లో అనుకొనికూడా మళ్ళీ శేషు పెళ్ళిలో ఆమె అన్నమాటలు జ్ఞాపకం వచ్చి ఆ ప్రయత్నం మానేసింది తను.

ఎవరో అనగా వింది శేషు హైదరాబాదులో ఉంటోందని.

హైదరాబాదులోవున్న స్త్రీ సంక్షేమ శాఖలో ఒక

ఉద్యోగానికి తను దరఖాస్తు పెట్టడం, ఇంటర్వ్యూకి రావల సిందని వాళ్ళు కార్డు పంపించడంతో తనకి యెంత యిష్టం లేకపోయినా శేషూ వాళ్ళ అమ్మగారిదగ్గరకి వెళ్ళక తప్ప లేదు. శేషూ ఎడ్రసుకోసం - కాని ఆవిడ తనకి ఇంతక్రితం లాంటి మర్యాదే ఇచ్చింది. "ఏమోనమ్మా ఏం ఎడ్రసులో ఏమిటో" అంటూ విసుగ్గా సమాధానం చెప్పింది.

"అంతదూరం యెందుకమ్మా ఉద్యోగానికి తెలి యనిచోట నీవు ఒంటరిగా ఎలా వుంటావమ్మా" అన్న అమ్మనీ,

"ఈ చివరిరోజుల్లో ఆడపిల్ల చేత ఉద్యోగం చేయించి ఆ సంపాదనమీద బ్రతకమంటావా!" అన్న నాన్ననీ, ఎలాగయితేనేం ఒప్పించి, స్టేషనుకి వచ్చింది భగవంతుడి మీద భారమేసి.

టిక్కట్టు కొనుక్కుని ప్లాట్‌ఫారంమీద రైలుకోసం ఎదురుచూస్తున్న టైములో, అదృష్టవశాత్తూ శేషూ వాళ్ళ నాన్నగారు కనబడి "ఎక్కడకమ్మా ప్రయాణం" అని పలకరించడంతో, తను వెళ్ళబోతూన్న ఉద్యోగం సంగతీ, మీ ఇంటికివస్తే మీరు లేరనీ గుక్కతిప్పుకో కుండా చెప్పింది తను. "నీకు తప్పకుండా ఉద్యోగంవస్తుంది. వెళ్ళు అమ్మా" అంటూ శేషూ ఎడ్రసురాసి చేతికిచ్చారు. "నీవు వెడుతూన్న ఉద్యోగానికి బహుశా శేషు మొగుడు రికమెండేషన్ చెయ్యగలడు. ఈ ఉత్తరం నేను యిచ్చినట్లు ఇయ్యి" అంటూ యెంతో ఆదరణగా మాట్లాడి, శేషూకి

యిప్పుడే టెలిగ్రాం యిస్తాను. బహుశా స్టేషనుకి వచ్చి నిన్ను తీసుకువెడుతుంది అన్న ఆచివరిమాటలు తనకు ఎంతో ఆనందాన్ని ఇచ్చాయి. నాన్నకి శేషూ వాళ్ళ నాన్న గారికీ నమస్కారం చెపుతూంటేనే రైలు కదిలింది.

హమ్మయ్య-ఇంక తనకి దురదృష్టపురోజులు పోయి అదృష్టపు రోజులు వచ్చినట్లే! లేకపోతే యేమిటి అనుకోకుండా శేషూ వాళ్ళనాన్నగారు కనిపించడం, ఎడ్రసు యివ్వడం పైగా సిఫార్సు ఉత్తరంకూడా దొరికింది ఇక ...

తెల్లవారేసరికి స్టేషన్‌లో దిగుతూండగానే శేషూ నన్ను వెతుక్కుంటూ వచ్చి తనని కౌగలించుకొని ఎన్నాళ్ళకు చూశానే అంటూ ఇంటికి తీసుకువెడుతుంది. ఆ తరువాత వాళ్ళ ఆయనకు పరిచయంచేసి, నా ఫ్రెండ్‌కి ఉద్యోగం వేయిస్తేనేగాని వీల్లేదని గట్టిగా చెబుతుంది.

హమ్మయ్య!

తనకింక గడ్డురోజులు పోయాయి! తనజీవితం వసంత ఋతువులా గడిచిపోతుంది. ఈ వచ్చే ఉగాదియే తనకూ తన జీవితానికి నాంది పలుకుతుంది-

ఇలా ఆలోచనల తోరణాలతో, రైల్లో రాత్రల్లా ఒక్కక్షణం కన్నుమూయకుండా, మరునాడు శేషూతో తను గడుపబోయే మధురక్షణాలగురించి తీయగా తలపోస్తూ కస్తూరి ఆమట్టునే కూర్చుంది.

తెల్లారిపోయింది. హైదరాబాద్ వచ్చేసింది.

స్టేషన్‌లో రైలు ఆగుతూండగానే కస్తూరి కిటికీలోంచి తల దూర్చి ప్లాట్‌ఫారం అంతా పరిశీలించసాగింది. మెడవంచి మరీ చూడసాగింది. అటూ యిటూ ఎంత జాగ్రత్తగా వెతికినా ఆమె కళ్ళకి శేషూ కనిపించ లేదు-

ప్లాట్‌ఫారం అంతా హడావిడి తగ్గుతోంది. శేషూ రాలేదేమోననే అనుమానం కలిగింది కస్తూరికి.

"శేషూ రావలసిందే కాని ఎందుకు రాలేదు చెప్మా" అని తర్కించుకుంటూ సూట్‌కేస్ పట్టుకుని రైలు దిగింది నెమ్మదిగా. ఇంకా ఆశపోలేదు. మళ్ళీ ఓమారు ప్లాట్‌ఫారం అంతా పరకాయించింది. ఊహుం...కస్తూరికి ఉడుకుమోతుతనం వచ్చింది - వెంటనే కోపం కూడా వచ్చింది.

తనే అయితే యిలా చేసునా శేషు వస్తోందని తెలిస్తే రెండు మూడు గంటలు ముందుగా స్టేషనుకి వచ్చి యెంతో ఉత్సాహంతో రైలుకోసం కళ్లల్లో వత్తులు వేసుకుని మరీ యెదురుచూస్తూ ఉండును.

ఏమిటి యిలా చేసింది శేషూ!

ఏమైనా ముఖ్యమైన పనుల్లో వుండిపోయిందేమో, ఎంతపని వుంటేమాత్రం చిన్ననాటి స్నేహితురాలు రావడం కంటేనా!

ఇప్పుడేమిటి చెయ్యడం!

చేతిలో ఎడ్రసువుంది. తిన్నగా శేషూవాళ్ళ ఇంటికి వెడితే, కాని అలా వెళితే శేషూని చివాట్లు పెట్టడానికి

వీలుండదు, తను స్టేషన్‌కు రాకపోవడానికి యేవో చిలిపి కారణాలు చెప్పేస్తుంది. అయినా తనకు ఉద్యోగం రావాలంటే యీ రికమెండేషన్ లెటర్ శేషు భర్తకి చూపించాలి కదా అనుకొని, టాక్సీ పిలిచి శేషూ వాళ్ళ ఎడ్రస్‌కి పోనియ్యమంది. తీరా వెళ్ళితే యింటికి తాళంవేసి వుంది. ఏమిటి చెయ్యడం? ఇంటర్వ్యూకి గంటకూడా టైము లేదు. అని ఆలోచించి, తిన్నగా ఆఫీసుకి పోనియ్యమంది టాక్సీని. తను వస్తూన్నట్లు ఇచ్చిన టెలిగ్రాం బహుశా అంది వుండదు. అని మనస్సు సరిపెట్టుకుందే కాని రాత్రల్లా ప్రయాణంచేసి బడలికగా వుంది. బట్టలయినా మార్చుకోవడానికి యెక్కడా అవకాశం లేకపోయింది అనుకుంటూంటే, టాక్సీ ఆపి ఆఫీసుకి వచ్చినట్లు చెప్పాడు. డ్రైవరు సూట్‌కేస్ తీసుకొని టాక్సీకి డబ్బులిచ్చి పంపించివేసి, ఆఫీసు గేటుకేసి నిరుత్సాహంతో అడుగు కదిపింది కస్తూరి.

గేటు లోపలకువచ్చి నాలుగు అడుగులువేసి ఆఫీసు కేసి తలయెత్తి చూసింది. ఆఫీసు వరండాలో పట్టుచీర కట్టుకుని, సిగనిండుగా పువ్వులు పెట్టుకొని, పేపరు చేతిలో మడతలు పెడుతూ కనిపించింది శేషు. తనకళ్ళని తనే నమ్మలేకపోయింది కస్తూరి. చూశావా! నా శేషు నాకోసం ముందుగానే వచ్చి యిక్కడ నా ఉద్యోగం కోసం అన్ని యేర్పాట్లు చేస్తోంది అని మనసుకి చెపుతూనే మళ్ళీ అవునా కాదా అన్నట్లు పరిశీలనగా చూసి, అవును. అనుమాన

మేమింటి అనుకోని, "శేషు..." అంటూ గట్టిగానూ, ఆదుర్దాగానూ, ఆనందంతోనూ అరిచింది కస్తూరి. తొందరగా అడుగులు వేసుకుంటూ తనవయిపే వస్తున్న కస్తూరిని చూసి ఒక్క క్షణం విస్తుపోయింది. ఎర్రని ముతకచీర కట్టుకుని సన్నగా పాలిపోయినట్లున్న శరీరంతో కనిపించింది. "ఉష్" అంటూ చూపుడు వేలు ముక్కు మీదకు చూపిస్తూ అంది. శేషు దగ్గరనుండి వచ్చిన సమాధానంతో తనలోని ఉత్సాహం అంతా నీరయిపోయింది. చేతిలో సూట్ కేస్ బరువుగా తోచింది. చేసేదిలేక బరువుగా ఆఫీసు మెట్లు ఎక్కి వరండాలోకి వచ్చింది కస్తూరి. "ఏమిటి యిలా వచ్చావ్" అంది శేషు. ఆ అడగడంలో యే మాత్రమూ స్నేహభావం కనిపించ లేదు కస్తూరికి. అయినా హాస్యానికి అంటుందేమోనని నవ్వుతూ శేషూకి దగ్గరగా వెడుతూ చేతులు అందుకోబోతూ "ఎందుకీ హాస్యమాడతావ్, నేను వస్తూన్నట్లు నీకు మీ నాన్నగారు టెలిగ్రాం ఇచ్చారుగా" అంది.

"అబ్బే, మాకేం టెలి గ్రాం రాలేదే!" అంది ముఖం చిట్లిస్తూ శేషు.

"మరైతే నాకంటే ముందు యెందుకు వచ్చి ఉంటావు" అంది ఇంకా చనువుగా కస్తూరి.

"కొంచెం నింపాదిగా మాట్లాడుమూ" అంది విసురుగా.

శేషూలోని మార్పును చూసి, వినయంగానే అంది– "ఈరోజు ఇక్కడ ఇంటర్వ్యూకి వచ్చాను" అని.

"నేనూ ఈ ఉద్యోగానికే వచ్చాను" అంది చేతి వాచీ చూసుకుంటూ.

తను కనిపించగానే ఆమె యెంతో ఆనందిస్తుందనీ, తన కష్టాలు తీరుస్తుందనీ, తన అదృష్టదేవతనీ యెన్నో ఆశలు పెట్టుకొని ఇంత దూరం వచ్చానే, ఎందుకిలా మారిపోయింది శేషూ అనుకుని. ఇంకా తనని తమాషా చేస్తుందేమోననే అనుమానంతో—

"శేషూ, ఎన్నో ఉద్యోగాలకి అప్లయి చేశాను. ఒక్క ఉద్యోగం దొరకలేదు. నా దురదృష్టంకొద్దీ అమ్మా నాన్నగారూ పెద్దవాళ్ళయిపోయారు. నాన్నగారు రిటైరై ఇన్నాళ్ళయినా ప్రావిడెంటుఫండు ఇప్పటికి రాలేదు. పెంషన్ ఆశ అసలులేదు. ఈ పరిస్థితిలో యీ ఉద్యోగం మీద ఆశ పెట్టుకొని వచ్చాను. నీవు యీ ఊర్లోనే వున్నావని మీ నాన్నగారు చెప్పారు. ఇదిగో యీ ఉత్తరం మీ ఆయనకు ఇమ్మని రాసిచ్చారు" అంటూ బేలగా అంటున్న కస్తూరి మాటలు అప్పుడే అక్కడకు వస్తున్న శేషూ భర్త చెవిని పడ్డాయి.

"ఈమె యెవరూ!" అంటూ శేషూని అడిగాడు వస్తూనే.

శేషూ కస్తూరిని అయిష్టంగానే పరిచయం చేసింది. "ఈమె నా చిన్నప్పటి స్నేహితురాలు లెండి. ఇంతకీ ఇంటర్వ్యూ సంగతులేమిటి? ఇక టైము పదినిముషాలే వుందే!" అంటూ మాటమార్చింది.

"ఇప్పుడు ఇంటర్వ్యూకి వచ్చినవారిలో నీవూ, కస్తూరీ అనే యీ అమ్మాయి క్వాలిఫికేషన్‌కి సరిపోతారు. నా రికమెండేషన్ నీకే కనుక, తప్పకుండా నీకే ఉద్యోగం రావచ్చు" అన్నాడతను.

కస్తూరి "నమస్కారమండీ" అని వినయంగా అతని చేతికి కవరు ఒకటి వచ్చింది. గబగబాతీసి చదివి, "శేషూ! నీవేమంటావ్? మీ నాన్నగారు ఈ అమ్మాయికి ఉద్యోగం వచ్చేటట్లు చూడమన్నారు. వాళ్ళ కుటుంబ పరిస్థితి యేం బాగోలేదుట" అంటూ కస్తూరికేసి పరిశీలనగా చూశాడు శేషూ భర్త. దీనంగా వున్న ఆ కళ్ళను ఎప్పుడో ఎక్కడో చూసినట్లు చటుక్కున జ్ఞాపకంవచ్చింది. అవును ఆరోజున చిలిపి చూపులతో తనని ఆకర్షించిన ఆ అమ్మాయే! ఆ రోజున కట్నంకోసం ఆశపడి శేషూని పెళ్ళిచేశారు. తన తల్లి తండ్రులు. అనుకుంటూన్న భర్తని శేషూ "ఏమిటి ఆలోచిస్తున్నారు" అంది.

"అదే ఉద్యోగం సంగతి" అన్నాడు.

"ఆ ఉద్యోగం వస్తేమట్టుకు ఇంతదూరం వచ్చి అది ఉద్యోగం చేస్తుందా! ఏమంటావే కస్తూరీ?" అంది శేషూ.

"అలా అనకే. ఈ ఉద్యోగంమీద ఎన్నో ఆశలు పెట్టుకువచ్చా" అంది కస్తూరి.

"ఈ స్త్రీ సంక్షేమ శాఖలో ఉద్యోగం చేయాలని ఎన్నాళ్ళమట్టో ఎదురు చూస్తున్నాను ఈ అవకాశంకాస్తా నువ్వు ఉపయోగించుకోవాలని చూడకు" అంది విసురు

గానే. "మన చిన్ననాటి స్నేహాన్ని మరచి మాట్లాడు తున్నావు శేషూ. కొంచెం స్థిమితంగా ఆలోచించు. ఉద్యోగ అవసరం నీ కంటే నాకు..." అంది కస్తూరి. మాట మధ్య లోనే గొంతుక పొడి ఆరిపోయింది. "శేషూ! నీవు కేవలం కాలక్షేపం కోసం ఉద్యోగం చెయ్యాలనుకుంటున్నావ్. తోటి స్త్రీగా, చిన్ననాటి స్నేహితురాలుగా ఈ చిన్న సహాయం చెయ్యలేవూ! ఇదేనా ఆదర్శవంతమైన స్నేహానికి చిహ్నం!" శేషూ భర్త అంటూంటే, ఇంటర్వ్యూకి బెల్ కొట్టారు. నిస్సహాయంగా చూసింది శేషూకేసి ఒక మారు.

ఆ చూపులు శేషూని కలవరపరిచాయి. కాని కస్తూరికి ఉద్యోగం వేయించాలనేది భర్తకి అంత పట్టుదల ఎందుకురావాలీ! అనే కోపంతో 'వీల్లేదు, ఈ ఉద్యోగం నాకే రావాలి' అంటూంటే, కస్తూరిని ఇంటర్వ్యూకి రమ్మన్న పిలుపుతో రూములోకి వెళ్ళింది.

ఇంటర్వ్యూ పూర్తయి ఇవతలకి వచ్చిన కస్తూరితో "నీకు ఉద్యోగం తప్పకుండా వస్తుంది. నీకే రికమెండ్ చేశాను. అన్న శేషు భర్తమాటలకు ఉలిక్కిపడింది "నిజంగానా? నాకు ఉద్యోగం వస్తుందా!" అంది ఆశ్చర్యపోతూ.

వెంటనే అపుడే తన ఇంటర్వ్యూ పూర్తిచేసుకొని ఇవతలికి వచ్చిన శేషూని చూసి గతుక్కుమంది కస్తూరి. 'స్నేహం కోసం ఉద్యోగం మానేయాలా? మరి ఉద్యోగం లేకపోతే జీవితంగడిచేది ఎట్లా!' ఇలా తనలో తను తర్కించుకుంటూ ఏ నిర్ణయానికీ రాలేక నిశ్చేష్టురాలై నిలబడిపోయింది కస్తూరి. ఇలా అదృష్టం పరీక్షిస్తుందని అనుకోలేదు కస్తూరి.

ఉద్యోగంలోచేరి శేషూలాంటి ఆప్యాయమైన వ్యక్తి యొక్క పవిత్రమైన స్నేహాన్ని పోగొట్టుకోవడమా!

శేషూ స్నేహంకోసం రాకరాక వస్తూన్న ఈఉద్యోగ అవకాశాన్ని కాస్తా వదులుకొని, నాన్నా తనూ అమ్మా శాశ్వతంగా దారిద్ర్యంలో కూరుకుపోవడమా-

దేనికోసం ఏ అదృష్టాన్ని వదులుకోవడం!

అదృష్టం తనని యిలా హఠాత్తుగా పరిశీలిస్తుందని అనుకోని కస్తూరి ఆ పరిస్థితిలో ఏం నిర్ణయించుకోలేక అలా ఎంతసేపో నిశ్చేష్టురాలై ఉండిపోయింది.